ప్రజాశక్తి

ఆదివారం 3 డిసెంబర్ 2023

5

విజయనగరం



నగరాభివృద్ధికి అజెండా ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర అభివృద్ధితో పాటూ, సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయంగా కృషి చేస్తున్నామని మేయర్ వి.విజయలక్ష్మి అన్నారు. శనివారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలో పొందుపరిచిన 46 అంశాలకు ఆమోదం తెలిపారు. ముందుగా పొందుపరిచిన అంశాలపై ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. నగర సుందరీకరణకు, అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను కేటాయిస్తూ అవి సత్వరమే పనులు పూర్తయ్యే విధంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఫ్లోర్‌లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ నగరంలో ఎన్నడూ లేనంత అబివృద్ధి ప్రస్తుతం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో జరుగుతుందన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, పిన్నింటి కళావతి, బోనెల ధనలక్ష్మి, ఇన్చార్జి ఈఈ దక్షిణామూర్తి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తుపాను ముప్పు

వంగర.. పొలంలో కోతకోసిన వరిచేను తరలిస్తున్న రైతులు

- ఆందోళనలో రైతులు
- పంట పొలాల్లోనే వరికుప్పలు
- అప్రమత్తం చేస్తున్న వ్యవసాయ అధికారులు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా బలపడనుందని వాతావరణశాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పొలాల్లో వరి చేలను కుప్పలుగా పెట్టి ఉంచడం, మరికొన్ని చోట్ల కోసి ఉండడంతో రైతుల్లో గుబులు నెలకొంది. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో వరి పంట 2,31,835 ఎకరాల్లో సాగవ్వగా, నేటివరకు 1,53,675 ఎకరాల్లో (66 శాతం) వరి కోతలు పూర్తయ్యాయి. కోసి ఉంచిన పంటలో 90 శాతం వరకు పొలాల్లోనే ఉండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రజాశక్తి-రేగిడి, పూసపాటిరేగ

తుపాను నేపథ్యంలో రైతుల్లో ఆందోళన నెలకొంది. ముమ్మరంగా వరికోతలు కావడం, కోసిన చోట పంట పొలాల్లోనే కుప్పలు పెట్టి ఉంచడం, మరికొన్ని చోట్ల కుప్పలు పెట్టకుండా ఉంచడం వల్ల వర్షాలు పడితే పంటంతా పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ నెల 4న కోస్తాంధ్ర తీరానికి తుపాను చేరుకొని 5న నెల్లూరు- మచిలీపట్నం మధ్య తీరం దాటుతుందని, ఈ నేపథ్యంలో ఆది, సోమ, మంగళ వారాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. కోస్తాంధ్ర జిల్లాలో అతి భారీ వర్షాలు పడతాయని, 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశాలు ఉందని చెబుతున్నారు. దీంతో చేతికందిన పంట ఏమవుతుందోనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రైతులకు వ్యవసాయశాఖ అధికారుల అవగాహన

తుపాను హెచ్చరికల కారణంగా అన్ని మండలాల్లోనూ వ్యవసాయశాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు. రేగిడి మండల వ్యవసాయ అధికారి గిరడ మురళీకృష్ణ, ఎఇఒలు, వ్యవసాయ అసిస్టెంట్లు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. కోసిన పంటలను కల్లాల్లోను, పంట పొలాల్లో కుప్పలుగా పేర్చుకోవాలని సూచించారు. ప్రస్తుతం వరి కోతల కోయవద్దని రైతులకు అవగాహన కల్పించారు. వరి కుప్పలపై టార్పాలిన్లు కప్పాలని సూచించారు. అప్రమత్తంగా ఉంటేనే పంటలను కాపాడుకోవచ్చని, లేకుంటే పంటలు నాశనం అవుతాయని హెచ్చరించారు.

వరిచేను కుప్పలు పెడుతున్న రైతులు

రైతులకు సూచనలు

తుపాను నేపథ్యంలో కోత వాయిదా వెయ్యాలని, ఓదెల మీద వున్న పంటను వెంటనే భద్రపరచుకోవాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. రైతులు కింది సూచనలు పాటించాలని తెలిపారు.

- రైతులు వరి పంట కోతలను వాయిదా వేసుకోవాలి.
- నూర్పిడి చేసిన పంటను సమీపం లో గల సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలి
- పనలపై ఉన్న పంట ను సమీపంలో గల కళ్లాల్లో గాని ఖాళీ భవనాల్లోగాని భద్రపరుచుకోవాలి.
- వరి కుప్పలకు చుట్టూ కాల్వ తవ్వితే కుప్పల కిందకు నీరు వెళ్లకుండా కాపాడుకోవచ్చును.
- ప్రతి పంట రెండోసారి ఏరివేతకు సిద్ధంగాఉన్నందున వెంటనే ఏరివేత చేసుకోవాలి.
- ప్రతి పంటలో చిన్నపాటి కాలువలు తీసుకుంటే నీటిని బయటకు పంపవచ్చు.
- మొక్కజొన్న గింజలను లేదా కంకులను సురక్షిత ప్రాంతాలలో పరదాలు కప్పి ఉంచాలి.

మత్స్యకారులకు అవగాహన

భోగాపురం : మత్స్యకారులు తీరంలో అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ బంగార్రాజు అన్నారు. తుఫాన్ ప్రభావం ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తీర ప్రాంత గ్రామమైన ముక్కాంలో ఆయన శనివారం పర్యటించారు. బోట్లను తీరానికి దూరంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం ఆదేశించే వరకు వేటకు వెళ్లరాదని ఆయన అన్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాలని విఆర్‌ఒ శ్రీలక్ష్మికి సూచించారు. ఉప తహశీల్దార్ శ్రీనివాసరావు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

తుపాను పట్ల అప్రమత్తం : కలెక్టర్

విజయనగరం : బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ఈనెల 3 నుంచి 6 వ తేదీ వరకు జిల్లాపై ప్రభావం చూపనున్నందున అప్రమతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. ముఖ్యంగా 4 నుండి 6 వరకు తీవ్ర తుఫాన్ హెచ్చరికలు ఉన్న దృష్ట్యా ఏ సమయం లోనైనా అత్యవసరంగా హాజరు కావడానికి ప్రతి ఒక్కరూ సన్నద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. తుపాను వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సెలవులు కూడా మంజూరు చేయడం జరగదని తెలిపారు. తుపానును ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు

జిల్లాస్థాయి రసాయనిక విపత్తుల నిర్వహణ కమిటీ సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

జిల్లాలో ప్రమాదకర రసాయనాలను నిల్వచేసే పరిశ్రమల ద్వారా విపత్తులు సంభవించకుండా ఆయా పరిశ్రమలు తగిన భద్రత చర్యలు చేపట్టాలని జిల్లా స్థాయి విపత్తుల నిర్వహణ కమిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. ప్రమాదకర రసాయనాలు నిల్వచేసే లేదా వాటిని వినియోగించే పరిశ్రమల వల్ల జరిగే ప్రమాదాల నివారణకు ఏర్పాటైన జిల్లా (క్రైసిస్ గ్రూప్) విపత్తుల నిర్వహణ కమిటీ తొలి సమావేశం శనివారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రసాయన పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన భద్రత చర్యలు, ప్రమాదాలు జరిగిన వెంటనే చేపట్టాల్సిన సహాయక చర్యలపై చర్చించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఆవరణలో జరిగే ప్రమాదాలకు సంబంధించి ఆయా పరిశ్రమలు ఎలాంటి చర్యలు చేపడుతున్నాయో వాటి ప్రణాళికలను నెలాఖరులోగా జిల్లా స్థాయి కమిటీకి అందజేయాలని ఆదేశించారు. ప్రమాదకర రసాయనాలను ట్యాంకర్ల ద్వారా రవాణా చేసేటపుడు తగిన భద్రత నియమాలు పాటించేలా రవాణాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రసాయనాలు తీసుకువెళ్లే ట్యాంకర్లు మార్గమధ్యంలో తమకు తోచినప్రదేశంలో నిలిపివేయకుండా, వాటిని నిలిపిన ప్రదేశం, ఆయా రసాయనాలకు సంబంధించిన సమాచారం సమీపంలోని పోలీసు, ఫైర్ తదితర శాఖల అధికారులకు తెలియజేసేలా స్పష్టమైన నిబంధనలు రూపొందించాలన్నారు. ఆయా వాహనాలకు ప్రమాదం జరిగినపుడు దానివల్ల ఆ సమీప ప్రాంతంలోని వారికి సమస్యలు లేకుండా చూసేందుకు హెచ్చరిక వ్యవస్థలు కూడా ఏర్పాటు చేయాల్సి వుందన్నారు. ఈ అంశంపై అవగాహన, సన్నద్ధత కోసం ఈనెల 21న మాక్ డ్రిల్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మైలాన్ పరిశ్రమలో దీనిని నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నట్లు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ తెలిపారు. ఆయా రసాయనిక పరిశ్రమల సమీప గ్రామాల ప్రజలకు ప్రమాదాలు జరిగే సమయంలో ఏవిధంగా వ్యవహరించాలనే అంశంపై శిక్షణ ఇవ్వాలన్నారు. విశాఖలోని సివిల్ డిఫెన్స్ విభాగం ద్వారా ప్రజలకు యీ అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా వున్నట్లు సివిల్ డిఫెన్స్ డిప్యూటీ కలెక్టర్ పద్మలత చెప్పారు.

జిల్లాలో అత్యంత ప్రమాదకర రసాయనాలు నిల్వచేసే పరిశ్రమలు లేవని, అయితే ప్రమాదకర రసాయనాలు నిల్వచేసే ఫ్యాక్టరీలు పది వరకు వున్నట్లు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జివివిఎస్ నారాయణ చెప్పారు. వీటిలో ఎనిమిది పరిశ్రమలు ప్రమాదాలు జరిగినపుడు హెచ్చరించే సెన్సర్ వ్యవస్థలు కలిగివున్నాయని, మరో రెండు పరిశ్రమల్లో ఏర్పాటు కావలసి వుందని వివరించారు. అవి ఏర్పాటు కావలసి వున్న రాజాంలోని వెంకటశ్రీనివాస, సీతారామ ఆయిల్ మిల్స్‌లో నెలరోజుల్లోగా ఏర్పాటు చేయించాలని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు, జిల్లా ఫైర్ ఆఫీసర్ రాంప్రకాష్, విశాఖలోని జాయింట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఇ.ఇ. సరిత, రవాణాశాఖ అధికారి రమేష్, ప్రకృతి విపత్తుల నివారణ సంస్థ డిపిఎం రాజేశ్వరి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కరరావు, రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ ప్రసాదరావు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో చీకటి రోజులు

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి- మెంటాడ

మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

రాష్ట్రంలో ఓ వెలుగు వెలిగి దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిన పంచాయతీ రాజ్ వ్యవస్థకు జగన్ పాలనలో చీకటి రోజులు దాపురించాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి ఆవేదన వ్యక్తంచేశారు. సర్పంచులు, ఎంపిటిసి సభ్యులను బిచ్చగాళ్లుగా మార్చిన ఈ సర్కారును సాగనంపాలని పిలుపునిచ్చారు. శనివారం మెంటాడలో జరిగిన ప్రస్తుత, మాజీ పంచాయతీ రాజ్ ప్రతినిధుల నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఎన్నికలకు ముందు బూటకపు హామీలతో భ్రమలు కల్పించి, అధికారంలోకి వచ్చాక పంచాయతీలను ఉత్సవ విగ్రహాల్లా మార్చారని ధ్వజమెత్తారు. విధులు, నిధులు లేక సర్పంచులు మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు పార్టీలకు అతీతంగా సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో వాలంటీర్లకు దక్కుతున్న గౌరవం కూడా సర్పంచులకు లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పిఆర్ వ్యవస్థను సర్వనాశనం చేశారని విమర్శించారు. ఇదే తీరు కొనసాగితే మున్ముందు ప్రజాప్రతినిధులు మరింత చులకన అవుతారని తెలిపారు. పంచాయతీ రాజ్ చాంబర్ ఉపాధ్యక్షులు ఆనెపు రామకృష్ణ నాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా పడకేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకటరావు, టిడిపి నాయకులు జి.ముసలి నాయుడు, రెడ్డి ఎర్రినాయుడు, ఆర్.రవిశంకర్, రెడ్డి ఆదినారాయణ, కుంచు వెంకట్, రెడ్డి సత్యనారాయణ, రెడ్డి ఇందిర, చిన్నంనాయుడు, జి.ప్రవీణ్, రామలింగేశ్వరరావు, కాశీవిశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతు తెలపండి

కార్పొరేటర్లకు, సచివాలయ కార్యదర్శులకు అంగన్వాడీల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, గజపతినగరం

దత్తిరాజేరు మండలం మరడాం సచివాలయ సిబ్బందికి వినతి అందిస్తున్న అంగన్వాడీలు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8 నుంచి సమ్మెలోకి వెళ్లనున్న నేపథ్యంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్‌వాడీ కార్యకర్తలు సచివాలయ కార్యదర్శులకు, విజయనగరంలోని డివిజన్ కార్పొరేటర్లకు, సచివాలయ కార్యదర్శులకు సమ్మె నోటీసులు అందజేశారు. సమ్మె సన్నాహకంలో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించి శనివారం విధులకు హాజరయ్యారు. కార్పొరేటర్లు రామకృష్ణ, భానుమూర్తి, గాజులరేగ ఇన్‌ఛార్జి కె.రాజాకు, సచివాలయ కార్యదర్శులకు సమ్మె నోటీసు అందజేశారు. తమ సమ్మెకు సహకరించాలని ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, ప్రాజెక్ట్ నాయకులు ప్రభ, విశాలాక్షి, శివలక్ష్మి, లలిత, తిరుమల, ప్రసన్న, తదితరులు తెలిపారు. సమ్మె లేదని అధికారులతో చెప్పించి వర్కర్లను గందరగోళంలోకి నెట్టే ప్రయత్నం ప్రభుత్వం మానుకోవాలని, చిత్తశుద్ధితో సమస్యలను పరిష్కరించాలని హితవు పలికారు. గత 4 సంవత్సరాలుగా అనేక రూపాల్లో మా యొక్క నిరసనలు తెలియజేశామని, ప్రభుత్వం మొండిగా వ్యవహరించడంతోనే సమ్మె చేయాల్సి వస్తుందని లబ్ధిదారులు, ప్రజలు, ప్రభుత్వ పెద్దలు అర్థం చేసుకోవాలని కోరారు. సమ్మెకు సహకరించాలని గజపతినగరం, మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులను కోరారు. మరోవైపు సమ్మెకు వెళు తున్నట్లు సచివాలయ కార్యదర్శులకు నోటీసులు అందజేశారు. అంగన్వాడీ సమస్యలు పరిష్కారం చేయాలని డిసెంబర్ 8వ తేదీ నుంచి అంగన్వాడీ సెంటర్లకు తాళాలు వేస్తున్నట్లు ప్రాజెక్టు కార్యదర్శి పి జ్యోతి, సెక్టార్ లీడర్లు వాణి, ముత్యాలమ్మ, పద్మ, పద్మ కళా తెలియజేశారు. మానాపురం, గుచ్చిమి, మరడం, పోరలి, చామలవలసలో నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఎందుకు సమ్మె చేయాల్సి వస్తుందో వివరిస్తూ.. కరపత్రాలు పంచుతూ సమ్మెకు మద్దతు ఇవ్వాలని లబ్ధిదారులనున కోరారు. మానాపురం, మరడాం సచివాల కార్యదర్శులకు వినతి పత్రాలు ఇచ్చారు. సమ్మెకు రాజకీయ పార్టీలు , ప్రజా సంఘాలు, లబ్ధిదారులు ప్రజలు సహకరించాలని కోరారు.

మెంటాడ మండలం జయంతి, మెంటాడ, పోరాంలో తమ సమ్మెకు మద్దతు కోరుతూ లబ్ధిదారులకు వినతులు అందజేశారు. సెక్టారు నాయకులు జి.సన్యాసమ్మ, సుజాత, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. గజపతినగరం మండలం మధుపాడలో సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరుతూ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. సెక్టార్ నాయకులు నారాయణమ్మ, వెంకటలక్ష్మి, మాట్లాడారు. తుమ్మికాపల్లిలో ప్రాజెక్టు అధ్యక్షులు ఎం.సుభాషిని ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. దత్తిరాజేరు మండలం దత్తి సచివాలయంలోఓ పి.జ్యోతి, సూర్యకాంతం, దమయంతి, లీలాకుమారి తదితరులు ప్రచారం చేపట్టారు.

వంగర : అంగన్వాడీలకు వేతనాల పెంపు, గ్రాట్యుటి, పెన్షన్ అమలు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు పిలుపు మేరకు అంగన్వాడీలు విధుల్లో ఉంటూ శనివారం నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌గా మార్చాలని మూడు యాప్‌లను రద్దు చేయాలని లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు అందించాలని, ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల ఎనిమిది నుంచి సమ్మెలోకి వెళ్లడం తప్పదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పి భారతి, దమయంతి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : అంగన్‌వాడీల న్యాయమైన సమ్మెకు అన్ని వర్గాలూ సహకరించాలని సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ళ అప్పల సూరి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కార్మిక అమర వీరుల స్మారక భవనంలో అంగన్ వాడీల సమ్మె కర పత్రాలు వామ పక్ష ప్రజా సంఘాల నాయకులు విడుదల చేశారు. నెల్లిమర్ల మండలంలో నాలుగు సెక్టార్ల అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు, మినీలు నల్ల రిబ్బన్లతో విధులకు హాజరయ్యారు. సారిపల్లి సర్పంచ్ విభీషణరావుకి, నెల్లిమర్ల తదితర చోట్ల సచివాలయ కార్యదర్శులకు వినతులిచ్చినట్లు ప్రాజెక్ట్ నాయకులు మంగ వేణి తెలిపారు.

ఆర్మీ ఉద్యోగి నుంచి రూ.17 లక్షలు దోచేశారు

- విదేశీ ప్రయాణం పేరుతో మోసగించిన సైబర్ నేరగాళ్లు

ప్రజాశక్తి - భోగాపురం

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం, పోలీసులు, బ్యాంకులు చెబుతున్నాసరే చదువుకున్నవారు, ఉద్యోగస్తులు మోసపోతూనే ఉన్నారు. విదేశాలకు తక్కువ ఖర్చుతో వెళ్లేందుకు రాయితీ కల్పిస్తామని చెప్పడతంతో నిజమేనని అనుకుని చాలా మంది వీసా, పాస్‌పోర్టుల కోసం భారీ మొత్తంలో నగదును సైబర్ నేరగాళ్లకు ముట్టజెప్పి నష్టపోతున్నారు. సరిగ్గా అలాంటి ఘటనే మండలంలో చోటు చేసుకుంది. ఏకంగా ఆర్మీ జవాను నుంచే సైబర్ నేరగాళ్లు రూ. 17లక్షలు కొట్టేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చును. పోలీసులు అందించిన వివరాలు మేరకు.. పోలిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగికి సెప్టెంబరులో సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ వచ్చింది. మీరు కుటుంబంతో కలిసి విదేశాలు వెళ్లేందుకు రాయితీ కల్పిస్తామన్నారు. మీతో పాటు మరో ఫ్యామిలీని కూడా తీసుకొని వెళ్లవచ్చనని చెప్పారు. దీనికి గాను 75 శాతం కంపెనీ భరిస్తుందని, 25 శాతం చెల్లించాల్సి ఉంటుందని నమ్మబలికారు. నిజమేనని ఆ ఆర్మీ ఉద్యోగి అనుకున్నాడు. వెంటనే దీనికి సంబంధించిన డాక్యుమెంట్లు, ఆధార్‌కార్డు, ఫొటోలు పంపించాలని కోరారు. వీసా కోసం ఇబ్బందులు ఉన్నాయని అందుకు కొంత సొమ్ము చెల్లించాలని కోరడంతో ముందుగా వెయ్యి రూపాయలు వేశారు. అక్కడ నుంచి విడతల వారీగా సైబర్ నేరగాళ్ల ఖాతాలోకి ఫోన్‌పే ద్వారా, యోనో యాప్ ద్వారా ఏకంగా రూ.17 లక్షలు పంపించాడు. వేసిన సొమ్ము తిరిగి ఇవ్వాలని కోరగా ఇవ్వలేదు. దీంతో మోసపోయానని తెలుసుకొని చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేడు ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని డిఎస్‌ఎ ఇండోర్ స్టేడియంలో ఈనెల 8 నుంచి 10 వ తేదీ వరకు జరగబోయే 10వ ఎపి ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ - జూనియర్(అండర్-14) బాయ్స్ గర్ల్స్, 9వ ఎపి ఇంటర్ డిస్ట్రిక్ట్ క్యాడెట్ (అండర్-17) ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా జట్టు ఎంపిక ఈనెల 3 జరుగుతుందని ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జిఎస్‌వి కృష్ణమోహన్ తెలిపారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఐడి కార్డు కలిగి ఉండిన వారు అర్హుల తెలిపారు. దాని జిరాక్స్ కాపీ తో పాటుగా, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ కాపీ, వ్యక్తిగత ఫెన్సింగ్ ఎక్విప్‌మెంట్ తో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8374737707, 9052758099 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఎంఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజాంలో భౌతిక శాస్త్ర విభాగంలో క్వార్క్స్2కె 23 ఫెస్ట్‌లో విజయనగరం ఎంఆర్‌కాలేజీ విద్యార్థులు వివిధ పోటీల్లో ప్రతిభ చాటారు. పిపిటిలో పి.పవిత్ర, సెమినార్‌లో ఎస్.నీలవేణి, పోస్టర్ ప్రెజెంటేషన్‌లో ఆర్.భాగ్య, క్విజ్‌లో కల్యాణి బృందం ప్రథమ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను భౌతిక శాస్త్ర విభాగం అధ్యక్షులు ఎం.సాంబశివరావు, పి.సత్యన్నారాయణ అభినందించారు.

మురళీమోహన్ సేవలు అభినందనీయం

విజయనగరం : జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేసిన బి.మురళీమోహన్‌రావు చేసిన సేవలు అభినందనీయమని, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి డి.రమేష్ కొనియాడారు. జిల్లాలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతి పొంది శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్తున్న మురళీమోహన్‌ను శాఖ కార్యాలయంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిపిఆర్‌ఒ మాట్లాడుతూ మురళీమోహన్ విధి నిర్వహణలో ఎంతో అంకితభావాన్ని చూపించేవారని అన్నారు. డివిజనల్ పిఆర్‌ఒ ఎస్.జానకమ్మ, జెఆర్‌ఇ మల్లేశ్వరరావు, పిఆర్‌ఒ మజ్జి వాసుదేవరావు, ఎవిఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ, మురళీమోహన్‌తో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణపై సినిమా

దర్శకుడు పి.సత్యరెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జనం ఎంటర్‌ప్రైజెస్ పతాకంపై నిర్మాణం జరిగిన ఉప్పు సత్యాగ్రహం చిత్రాన్ని అంతా చూసి విజయవంతం చేయాలని సినిమా దర్శకులు, రచయిత పి. సత్యారెడ్డి కోరారు. చిత్ర ప్రచార కార్యక్రమం కోసం చిత్ర బృందం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోను బస్సుయాత్ర ద్వారా పర్యటిస్తోంది. అందులో భాగంగా శనివారం విజయనగరం చేరుకున్నారు. ఈ సందర్భంగా కోట జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు ఎందరో మహానుభావుల ప్రాణ త్యాగాలతో ఏర్పాటైందని, అటువంటి పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే ఆంధ్రప్రదేశ్ నష్టపోతుందని అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకునే లక్ష్యంతోనే ఈ చిత్రాన్ని నిర్మించామని అన్నారు. ప్రముఖ ప్రజా గాయకుడు గద్దర్ చివరిసారిగా ఈ చిత్రంలో నటించారని, కొన్ని పాటలు రాశారని తెలిపారు. విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ తదితర ప్రముఖులు ఈ చిత్రంలో నటించారన్నారు ఈ సినిమాను డిసెంబర్ రెండవ వారంలో విడుదల చేస్తామని, ప్రజల కోసం తీసిన ఈ సినిమాను ప్రతి ఒక్కరూ చూసి విజయవంతం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న దర్శకుడు పి.సత్యరెడ్డి

ఇదేమి సామాజిక న్యాయం?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సామాజిక సాధికార యాత్ర పేరిట ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఒకింత అసౌకర్యాన్ని కలిగించాయి. చాలా మంది తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. సామాజిక న్యాయం పేరిట బలప్రయోగాలు, అధికార దుర్వినియోగాలు సృష్టిస్తున్నారని జనం మండిపడుతున్నారు. వైసిపి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సుయాత్ర గడిచిన రెండు నెలల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో పూర్తయింది. ఈ యాత్ర ఎంతో విజయ వంతమైందని, జనం తండోపతండాలుగా వచ్చేశారని జిల్లా స్థాయి నాయకులు చెప్పుకుంటున్నారు. కానీ, వచ్చినవారంతా మనవారు కాదంటూ మండల, గ్రామ స్థాయి వైసిపి నాయకుల నోట వినిపిస్తున్న మాట. ఇటువంటివారిలో ప్రభుత్వ విధానాలు మింగుడు పడనివారు కొందరైతే ఎమ్మెల్యేల తీరు నచ్చనివారు మరికొందరు ఉన్నారు. ఫొటోల కోసం ఏకంగా మొక్కలు, చెట్లు కూడా నరికివేయడం పట్ల సొంత పార్టీ నుంచి కూడా సర్వత్రా విమర్శలు వెల్లువిరుస్తున్నాయి. పార్వతీపురం పట్టణంలో జరిగిన సామాజిక యాత్రకు ముందు రోజు రాత్రి ప్రధాన రహదారిపై ఉన్న చెట్లను నరికివేశారు. బొబ్బిలి మిగిలిన పట్టణ ప్రాంతాల్లో కూడా ఇదే రకమైన వైఖరి ప్రదర్శించారు. దీంతో, ఆయా పట్టణాల్లోని ప్రజలు, ప్రముఖులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. పార్వతీపురంలో మొక్కల నరికివేతపై చర్చోపచర్చలు నడుస్తున్నాయి. ఓట్లు, రాజకీయాల కోసం పచ్చని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పాడుచేశారంటూ పబ్లిక్ టాక్ నడుస్తోంది. బలప్రదర్శన కోసం చేసిన ఈ పని



ఎన్నికల్లో వైసిపి గట్టి దెబ్బ తగిలిస్తుందని కూడా చర్చ జరుగుతోంది. ఇటీవల నెల్లిమర్లలో జరిగిన సాధికార యాత్ర సందర్భంగా ఉదయం నుంచే చీపురుపల్లి రహదారిలో మొయిద జంక్షన్ వద్ద వాహనాలను స్తంభింపజేశారు. ఈ రోజు ప్రయాణికులు, వాహనదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. దాదాపు అన్ని సభలలోనూ జనాల్లో చర్చనడిచేందుకు అధికార పార్టీ ఇదే రకమైన వ్యూహం చేపట్టినట్టుగా జనం చెప్పుకుంటున్నారు. ఈ వ్యూహం వైసిపి పట్ల సానుకూలంగా ఉన్న జనాలను సైతం బాధించడం గమనార్హం. ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారడంతో జనాలు సకాలంలో ఇళ్లకు చేరుకోలేకపోయారు. ఇక బొబ్బిలి సాధికార యాత్ర సభ మధ్యలోనే జనాలు వెనుదిరగడంతో ఉమ్మడి జిల్లాలతో పాటూ సోషల్ మీడియా ద్వారా రాష్ట్ర మంత్రా చర్చ నడిచింది. ఇక జనాలు కేవలం సంబంధిత నియోజకవర్గాలకే పరిమితం కాలేదు. పక్కపక్క నియోజకర్గ జనాలు కూడా సభల్లో పాల్గొన్నారు. ఇటువంటివారిలో ఎక్కువ మంది రాజకీయాలపట్ల అంత ఆసక్తి లేనివారు, బొత్తిగా రాజకీయాలు లేనివారు కనిపించడం అనుమానాలకు తావిస్తోంది. అందుకు తగ్గట్టే జనం ఎక్కువగా వచ్చారనే భావన కలిగించడం కోసమూ, ఒక వేళ అనుకున్నంత జనం రాకపోతే ఫెయిలవుతామనే భయంతోనూ సంబంధిత ఎమ్మెల్యేలు ఇటువంటి జంబ్లింగ్ విధానం అనుసరించారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ సభల్లో కేవలం పథకాలు గురించి చెప్పడం, పార్టీ అధినేతను పొగడడం తప్ప, పరిష్కరించలేకపోయిన సమస్యల గురించి ఎక్కడా చర్చ జరగలేదు. వీటన్నింటికన్నా సభలకు హాజరైన మంత్రులు పాడిందే పాడినట్లు ప్రతిపక్ష పార్టీ, నాయకులను తిట్టడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని జనం చర్చించుకుంటున్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

భోగాపురం : నాడు నేడు కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ శాఖాధికారి బి.శాంత కుమారి అన్నారు. భోగాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టులోని అంగన్వాడీ టీచర్లకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మౌలిక సదుపాయాలపై శిక్షణా కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు రకాల పనులను ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా గుర్తించామన్నారు. మరుగుదొడ్లు, తాగునీరు, పెయింటింగులు, విద్యుత్తు పనులు చేపడతామన్నారు. డిఇఇ లింగేశ్వర రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్ పరిధిలో అంగన్వాడి టీచర్, హెచ్ఎం, చిన్నారుల తల్లులతో కలిపి కమిటీ వేయాలన్నారు. కమిటీ పేరుతో బ్యాంక్ ఎకౌంటు ఓపెన్ చేయాలన్నారు. ఆ అకౌంట్లో సంబంధిత నిధులు పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో భోగాపురం ప్రాజెక్టు పీడీ ఎస్తేరు రాణి, ఎసి డిపిఒ తవిటి నాయుడు, ఎపిఒ గోపీచంద్, అంగన్వాడి సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎంవిజిఆర్‌లో వర్చువల్ స్మారక ఉపన్యాసం

డెంకాడ : డాక్టర్ పివిజి రాజు శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎంవిజిఆర్ కళాశాలలో శనివారం 'రాజా సాహెబ్ విజన్ అండ్ ఫిలాసఫీ, వాటి రియలైజేషన్ అండ్ రిలేవెన్సు టు ప్రెజెంట్ టైమ్స్' అనే అంశంపై వర్చువల్ స్మారక ఉపన్యాసాన్ని నిర్వహించారు. ఈ ఉపన్యాసాన్ని డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చేత చేపట్టారు. విద్య, వ్యవసాయ రంగాలలో డాక్టర్ పివిజి రాజు గొప్పతనం, సామాజిక సేవల గురించి జయప్రకాష్ నారాయణ్ విద్యార్థులతో సంభాషించారు. అనంతరం ఎంవిజిఆర్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహించిన 24వ సర్ విజ్జీ ట్రోఫీ 2023 క్రికెట్ టోర్నమెంట్‌ని డైరెక్టర్ పి.సీతారామ రాజు ప్రారంభించారు. వర్చువల్ ఉపన్యాస కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎంసి శేఖర్, డీన్ ఎస్.మోహన్ కుమార్, ఎన్ఎస్ఎస్ పిఒ ఎన్.షణ్ముఖరావు, లైబ్రేరియన్ డాక్టర్ ఉమా మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ యజమానికి హక్కు పత్రంతో ఎంతో మేలు

రేగిడి : భూ యజమానికి హక్కు పత్రంతో ఎంతో మేలు అని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో భూ సమస్యలకు పరిష్కారం పేరుతో లబ్ధిదారులకు పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంకిలిలో 55 మందికి 19.88ఎకరాలు, వంగర మండలంలో ముగ్గురికి 0.96 సెంట్లు భూ పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి, వైస్ ఎంపిపిలు అచ్చెం నాయుడు, జగన్, తహశీల్దార్ సుదర్శన్ రావు, ఎంపిడిఒ శ్యామల కుమారి, ఎపిఒ గోవిందరావు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనులు ప్రారంభించాలి

బొబ్బిలి : పారాది నూతన వంతెన పనులు ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పారాది వంతెన కుంగడంతో భారీ వాహనాలను బాడంగి, తెర్లాం మండలాలు మీదుగా మళ్లించడంతో రోడ్లు పూర్తిగా గతుకులమయంగా మారాయన్నారు. రోడ్లపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.. సమావేశంలో సిపిఎం నాయకులు ఎస్.గోపాలం, ఎ.సురేష్ పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

రాజాం : రాజాం కోర్టు ఆవరణలో ఈ నెల 9న ఉదయం 10.30గంటలకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని మండల్ న్యాయసేవా సంఘ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎం. బాబు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్, సివిల్, ఫ్రీ లిటిగేషన్ కేసులను ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరిస్తామని, అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

నెల్లిమర్ల : బాధిత కుటుంబానికి అండగా ఉంటామని వైసిపి యువజన నాయకులు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు అన్నారు. నగర పంచాయతీ పరిధి కొండపేట (2,3వ వార్డు)కు చెందిన కార్యకర్త ఇటీవల జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు తనయుడు యువజన నాయకులు బడ్డు కొండ ప్రదీప్ నాయుడు బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించి రూ. 15వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, పైల భారతి, మొయిద శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పైల మురళి, సోషల్ మీడియా కన్వీనర్ పైల గణేష్, పాలూరి వాసు పాల్గొన్నారు.

పేపర్ ప్లేట్ మిషన్ అందజేత

డెంకాడ : మండలంలోని పెదతాడివాడకు చెందిన గాధిపల్లి వెంకటలక్ష్మికి డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో రూ. 2.5లక్షల విలువ గల పేపర్ ప్లేట్‌ను శనివారం అందించారు. స్థానిక ఎపిజివిబి బ్రాంచ్ ఆర్థిక సాయంతో ఈ మిషన్ అందించినట్లు ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు తెలిపారు. అనంతరం ఈ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, పెదతాడివాడ ఎంపిటిసి-1 గాధిపల్లి రమేష్, జెసిఎస్ మండల కన్వీనర్ సారిక గౌరీశంకర్, ఎపిఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆటో స్టాండ్‌పై పోలీసులకు ఫిర్యాదు

భోగాపురం : మండలంలోని తీరప్రాంతమైన ముక్కాం గ్రామంలోని ఆటో స్టాండ్ పై భోగాపురం ఆటో స్టాండ్‌కి చెందిన ఆటో డ్రైవర్లు ఎస్ఐ కృష్ణమూర్తికి శనివారం ఫిర్యాదు చేశారు. భోగాపురం ఆటో స్టాండ్‌లో ఉన్న ప్రయాణికులను ముక్కాం గ్రామానికి చెందిన ఆటో స్టాండ్ డ్రైవర్లు ఎక్కించుకొని తీసుకుని వెళ్ళిపోతున్నారని అన్నారు. దీంతో స్టానికంగా సీరియల్‌లో పెట్టుకున్న ఆటో డ్రైవర్లకు ప్రయాణికులు లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అలా ఎక్కించవద్దని ప్రశ్నిస్తే తిరగబడి కొట్లాటకు దిగుతున్నారని అన్నారు. ఎక్కించవద్దన్నందుకు ఇద్దరు డ్రైవర్లను సైతం కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎద్దు అప్పారావు కోరారు.

కరకవలసలో భవిష్యత్తుకు గ్యారెంటీ

గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

వేపాడ : మండలంలోని కరకవలస గ్రామంలో శనివారం టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యాన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ మాట్లాడుతూ టిడిపి మినీ మేనిఫెస్టో గురించి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుమ్మడి భారతి, సేనాపతి గణేష్, ఎం.రామకృష్ణ, సిరికి రమణ, వై సూర్యం, జగన్, పి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

తెర్లాం : మండలంలోని తమ్మయ్యవలస గ్రామంలో శుక్రవారం గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో అగ్నిప్రమాదం సంభవించి, పూరిల్లు దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నష్టాన్ని అంచనా వేసి బాధితులకు పరిహారం అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ శనపతి రాంబాబు, వైస్ ఎంపిపి సత్యనారాయణ, ఎంపిటిసి గిరి, పణుకువలస సర్పంచ్ చందక సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

మండల బడ్జెట్ సమావేశం

వేపాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం మండల బడ్జెట్ సమావేశం నిర్వహించారు. సభ్యులు చేయాల్సిన పనులపై చర్చించి, బడ్జెట్‌ను ఆమోదించారు. సమావేశంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు, ఎంపిడిఒ బిఎస్‌కెవిఎన్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సు

శృంగవరపుకోట : శృంగవరపుకోట డిపో నుంచి భద్రాచలం, పంచారామాల దర్శనానికి శనివారం ప్రత్యేక బస్సు పంపినట్లు డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. విహారయాత్రలకు, అరకు, విశాఖ, ఉత్తరాంధ్ర పర్యటనకు ప్రత్యేక బస్సులు డిపో నుంచి ఏర్పాటు చేస్తామని చెప్పారు.

కొత్త గోడ నిర్మించాలి

విజయనగరం కోట : ఉర్దూ పాఠశాల ప్రహరీ పాత గోడను కూల్చి కొత్త గోడను వెంటనే నిర్మించాలని మైనార్టీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ ఎండి హాసన్ షరీఫ్ కోరారు. శనివారం ఉర్దూ మున్సిపల్ పాఠశాల ప్రహరి గోడను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ 9వ డివిజన్‌లో వున్న ఉర్దూ మున్సిపల్ పాఠశాల వెనక గోడ సగ భాగం పడిపోయిందని, మిగతా సగం గోడ కూడా కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. పాత గోడను తొలగించి కొత్తగా నిర్మించాలని కోరారు.

టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శిగా భరత్

విజయనగరం కోట : విజయనగరం పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శిగా బెవర భరత్‌ను నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ అధిష్టాన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు భరత్ చూస్తున్న ఉపాధ్యక్ష బాధ్యతల్లో సతీష్‌ను నియమించారు.

యువ ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టండి

కలెక్టర్ నాగలక్ష్మి ● ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం తనిఖీ

ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-గంట్యాడ, డెంకాడ

యువ ఓటర్ల నమోదుపై బిఎల్ఒలు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. శనివారం గంట్యాడ మండలం రామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నరవ ఎంపియుపి స్కూల్, డెంకాడ మండలం జొన్నాడ పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. బిఎల్ఒల రిజిష్టర్లు, క్లెయిములు, ధరఖాస్తులను తనిఖీ చేశారు. ఫారమ్ 6,7,8లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు. శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక నమోదు కార్యక్రమంలో ప్రధానంగా దీనిపైనే దృష్టి సారించాలని సూచించారు. అలాగే డోర్ టు డోర్ సర్వేను పకడ్బంధీగా నిర్వహించాలని, ప్రతీ ఇంటికీ బిఎల్ఒలు తప్పనిసరిగా వెళ్లి సర్వే చేయాలని ఆదేశించారు. ఒకే డోర్ నెంబరులో పదిమంది కంటే ఎక్కువగా ఉన్న ఓటర్లు, సున్నా లేకా తప్పుడు డోర్ నెంబర్లు నమోదైన ఇళ్లకు వెళ్లి, తనిఖీ చేసి జాబితాల్లో సరిచేయాలని సూచించారు. మరణించిన ఓటర్ల ఇళ్లకు వెళ్లి, నోటీసులు ఇచ్చి వారి పేర్లను తొలగించాలని ఆదేశించారు. ఎటువంటి తప్పులు లేకుండా అత్యంత ఖచ్చితమైన ఓటర్ల జాబితాలను రూపొందించాలని కలెక్టర్ కోరారు. పర్యటనలో గంట్యాడ తాహశీల్దార్ పి.నీలకంఠేశ్వరరెడ్డి, డిప్యూటీ తాహశీల్దార్ సతీష్, డెంకాడ తాహశీల్దార్ ఆదిలక్ష్మి, డిటిలు పాల్గొన్నారు.

బొబ్బిలి : ఓటర్ల నమోదులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు సందర్భంగా శనివారం పట్టణంలోని పలు పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్ఒలుండి ఓటు నమోదుకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఓటు నమోదుకు ఫారం-6, తొలగింపునకు ఫారం 7, సవరణల కోసం ఫారం-8 పూర్తి చేసి ఇవ్వాలన్నారు. ఓటర్ల నమోదులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతో తహశీల్దార్ డోల రాజేశ్వరరావు ఉన్నారు.

వేపాడ : మండలంలోని అరిగిపాలెంలో ఓటరు నమోదు కేంద్రాన్ని తహశీల్దార్ కె.ప్రసన్న కుమార్ పరిశీలించారు. ఆరు దరఖాస్తులు వచ్చినట్లు బిఎల్ఒ ఎం.యశోద తెలిపారు. ఓటర్ నమోదు కార్యక్రమాల్లో ఏ విధమైన తప్పులు జరిగినా అందుకు బిఎల్ఒ పూర్తిబాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

ఓటర్ల జాబితాలో తప్పులను సరి చేయండి

గరివిడి : ఓటరు జాబితాల్లో తప్పులను సరిచేయాలని మాజీ మంత్రి కిమిడి మృణాళిని అన్నారు. శనివారం శివరాం గ్రామంలో పోలింగ్ స్టేషన్ వద్ద జరుగుతున్న ఓటర్ పరిశీలన కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ జాబితాలో మరణించిన వారు ఓట్లను, దొంగ ఓట్లను తొలగించాలని కోరారు. ఓటరు జాబితాలో పారదర్శకంగా వ్యవహరించాలిని కోరారు. కార్యక్రమంలో పైల బలరాం, సారేపాక సురేష్ బాబు, కుమిలి శ్రీనివాస రావు, గవిడి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపటడుతుందన్నారు. ధాన్యం కనీసం మద్దతు ద్వారా క్వింటాకు సాధారణ రకం రూ.2183గా నిర్ధారించినట్లు వెల్లడించారు. ధాన్యం మద్దతు ధరతో పాటు గోని సంచులు, లేబరు, రవాణా చార్జిస్ 21 రోజుల్లో రైతుల ఖాతాకు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి సత్య వెంకట వాసుదేవ, పిఎసిఎస్ అధ్యక్షులు రొంగలి కనక సింహాచలం, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, గ్రామ సర్పంచ్ పతివాడ గౌరీ, సబ్ డివిజనల్ లెవెల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ విజయ్ కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తుపానుపై రైతులు అప్రమత్తం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

వచ్చే మూణ్నాలుగు రోజులు తుపాను హెచ్చరికలు జారీ చేయడంతో రైతులంతా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ ఎడి ఎం.శ్యామసుందర్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని అలజంగి గ్రామంలో ఆయన పర్యటించారు. రైతులకు తగు సూచనలు చేశారు. భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వరికోతలు వాయిదా వేయాలని సూచించారు. ఆరో తేది వరకు వ్యవసాయ పనులు చేయవద్దన్నారు.

నెల్లిమర్ల : వరి సాగు చేసే రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఒ ఎం. పూర్ణిమ సూచించారు. శనివారం ఆమె వాతావరణ శాఖ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని సీతారామునిపేట, తంగుడుబిల్లి, జోగిరాజు పేట గ్రామాల్లో పర్యటించి రైతులకు వరిపంట రక్షించు కోవడం పై అవగాహన కల్పించారు. వరి పంట కోసి పనలు చేనులో వుండే పరిస్థితులలో తక్షణమే పనలను కట్టలుకట్టి కుప్పలు పెట్టుకోవాలన్నారు. పంట తడిసిపోతే పనల్లో మొలకలు రాకుండ 5శాతం ఉప్పు ద్రావణం పిచికారీ పై ముందస్తుగా క్షేత్ర సహాయకులు అవగాహన కల్పించాలని సూచించారు.

గజపతినగరం : తుపాను పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి సిహెచ్ ధనలక్ష్మి అన్నారు. శనివారం కొత్తబగ్గాం గ్రామంలో పంట పొలాలను ఆమె సందర్శించారు. రేపటి నుండి ఆరో తేదీ వరకు తుపాను హెచ్చరిక నేపథ్యంలో రైతులు వరి కోతలను ఆపివేయాలని కోరారు. నూర్పిడి చేసిన పంటను తడవకుండా టార్పాలిన్లతో కప్పాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో విఎఎ సౌజన్య పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని, నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

కార్మికులపై చిన్నచూపు తగదు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

భవన నిర్మాణ కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు తగదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మండిపడ్డారు. మండల కేంద్రంలోని చెరకు కాటా ప్రాంగణంలో భవన నిర్మాణ కార్మికుల మొదటి మండల మహాసభను శనివారం నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి తరిణి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన మహాసభలో తమ్మినేని మాట్లాడారు. కార్మికుల సంక్షేమం కోసం సెస్ రూపంలో వసూలు చేసిన రూ.650 కోట్లు ప్రచారం కోసం ఉపయోగించడం సిగ్గుచేటన్నారు. కేరళ మాదిరిగా కార్మిక సంక్షేమ బోర్డును అమలు చేయాలన్నారు. సంక్షేమ బోర్డు నుంచి దారి మళ్లించిన సొమ్మును తిరిగి బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక రంగంలో ఉన్న 16 రకాల అసంఘటిత కార్మికులను ఆదుకోవాలన్నారు. ఇసుకను ఉచితంగా అందించి ఇనుము, సిమెంటు వంటి నిర్మాణ సామగ్రి ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్మికుల కుమార్తె వివాహాలకు వివాహ కానుకను బోర్డు నుంచే ఇచ్చి, వారి పిల్లల చదువులకు స్కాలర్‌షిప్ ఇవ్వాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన కార్మిక కుటుంబానికి రూ. 5 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, గాయపడిన వారికి వారి నష్టాన్ని బట్టి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు బోర్డు నుంచి నెలకు రూ.5 వేలు పింఛను చెల్లిస్తూ, పనిముట్ల కొనుగోలుకు రుణ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం మహాసభ ప్రాంగణం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, గాడి అప్పారావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

భవన నిర్మాణ కార్మికుల మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవ అధ్యక్షులుగా తరిణి వెంకటరమణ, అధ్యక్ష, కార్యదర్శులుగా జామి శ్రీరాములు, జామి గణేష్, సహాయ కార్యదర్శిగా కోటాన చిన్న, ఉపాధ్యక్షులుగా పట్నాల సన్యాసిరావు, కోశాధికారిగా రామోజీ హరి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దుక్క ఈశ్వరరావు ఎన్నికయ్యారు.

వైసిపికి ప్రజలే అండ

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

హెల్త్‌క్లీనిక్‌ను ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-తెర్లాం

సిఎం జగన్‌కు ప్రజల అండదండలు ఉన్నంత కాలం ఎవరేమీ చేయలేరని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని వెలగలవలస, కూనాయవలస గ్రామాల్లో రైతు బరోసా కేంద్రం, వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్ భవనాలను ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, అలజంగి జోగారావుతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొందరు అప్పుడప్పుడు విరామ సమయంలో వచ్చి వైసిపిని, సిఎం జగన్‌ను నామరూపాలు లేకుండా చేస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని చెప్పారు. సిఎం జోలికొస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా చినప్పలనాయుడును గెలిపించాలని కోరారు.

అనంతరం గంగన్నపాడు గ్రామానికి చెందిన చీమల చంద్రశేఖర్, పెదపెంకి గ్రామానికి చెందిన అలజంగి వెంకటేశ్వరరావు అనే వికలాంగులకు జెడ్‌పి నిధుల నుంచి త్రిచక్ర వాహనాలను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణు, ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, ఎంపిపి నర్సుపల్లి ఉమాలక్ష్మి, గర్భాపు రామారావు, వైస్ ఎంపిపి సత్యనారాయణ, సర్పంచ్ విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల నిధుల మళ్లింపుపై ప్రచారం

మాట్లాడుతున్న పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి రాజారావు

ప్రజాశక్తి- గంట్యాడ

పంచాయతీలకు కేటాయించిన నిధులను సర్పంచులకు తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వం మళ్లించి మోసం చేయడంపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నామని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి గేదెల రాజారావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో శనివారం నియోజకవర్గం స్థాయి సర్పంచులు, మాజీ సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం కేంద్రం నుంచి పంచాయతీలకు వచ్చిన రూ. 8,629 కోట్లను మళ్లించి తన సొంత అవసరాలకు వాడుకుందన్నారు. చెక్కుల మీద సర్పంచుల సంతకాలు లేకుండా సర్పంచులకు కనీసం సమాచారం ఇవ్వకుండా సిఎఫ్ఎంఎస్ ఖాతాల నుంచి నిధులను రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించిందని ఆరోపించారు. పంచాయతీ నిధులు మళ్లింపుపై ప్రస్తుత, మాజీ సర్పంచులంతా గ్రామ వికాసం పేరిట గ్రామాల్లో ప్రచారం చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. పార్టీలకు అతీతంగా సర్పంచులంతా పాల్గొని నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 10న శ్రీకాకుళం, 11 కాకినాడ, 14 నరసారావుపేటలో సమావేశాలు నిర్వహిస్తామని ఈ సమావేశాలకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారని స్పష్టం చేశారు. ప్రభుత్వం సర్పంచులకు చేస్తున్న ద్రోహంపై పోరాటానికి ప్రస్తుత, మాజీ సర్పంచులంతా సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు స్వామినాయుడు, మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ, మాజీ సర్పంచులు బాస్కరనాయుడు, అల్లు విజయ, నియోజకవర్గం సర్పంచుల సంఘం ఇంచార్జి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే ఎస్ఎఫ్ఐ లక్ష్యం

ప్రజాశక్తి- చీపురుపల్లి

విద్యారంగ సమస్యల పరిష్కారమే ఎస్ఎఫ్ఐ లక్ష్యమని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పూడి రామ్మోహన్ అన్నారు. ఎస్ఎఫ్ఐ మండల మహాసభలు చీపురుపల్లి మండల కేంద్రంలో శనివారం జరిగాయి. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ మండలంలో హాస్టల్ విద్యార్థుల సమస్యలపై, జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పనకై, డిగ్రీ కళాశాలలో మంచినీటి సదుపాయం కోసం, ప్రైవేటు జూనియర్ డిగ్రీ కళాశాలలో ఫీజులు దోపిడీకి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలను చేసినట్లు తెలిపారు. 31వ ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు నెల్లిమర్ల కేంద్రంగా జరుగుతాయన్నారు. జిల్లా మహాసభలు జయప్రదానికి చీపురుపల్లి మండలంలో ఉన్న విద్యార్థులు, ప్రజలు, మేధావులు, యువత ముందుకు రావాలని కోరారు. కొత్తగా ఎన్నికైన మండల కమిటీకి అధ్యక్ష కార్యదర్శులుగా రమణ, వంశీలను నూతన మండల కమిటీ ఎన్నుకున్నట్లు వెల్లడించారు. బాలికల కన్వీనర్‌గా రూప ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కమిటీలోకి గోవిందరాజు

గోవిందరాజు

ప్రజాశక్తి-బాడంగి

ప్రపంచ ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన అడ్డా గోవిందరాజు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలో ఆయన్ను నియమించారు. తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని గోవిందరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలియజేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి- మెంటాడ

అధికారుల వైఫల్యం కారణంగా ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం తలెత్తిందని, వెంటనే త్వరగా నిర్మాణాలు పూర్తిచేసే దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలానికి 1645 ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, వీటిలో 224 పునాది దశలో ఉన్నాయని తెలిపారు. రూఫ్ లెవెల్‌లో 70 ఉన్నాయని, 47 ఇళ్లు శ్లాబ్ వేశారని చెప్పారు. 1078 ఇళ్లు పూర్తయ్యాయని చెప్పారు. జనవరి నెలాఖరికి మిగతా ఇళ్లు పూర్తిచేయాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ పాండ్రంకి త్రివిక్రమరావు, వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, డిటి వెంకట్రావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హైమావతి, హౌసింగ్ జెఇ డేవిడ్ ప్రసన్నకుమార్, పిఆర్ ఎఇ గౌతమ్, పలు శాఖలకు చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు

నెల్లిమర్ల : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జగనన్న గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా హౌసింగ్ అధికారి వి.శ్రీనివాసరావు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న హౌసింగ్ మెగా కంప్లీషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకాధికారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇంతవరకు ప్రారంభం కాని జగనన్న గృహ నిర్మాణాలు వచ్చే నెల 31లోగా పూర్తి చేయాలని సూచించారు. మంజూరైన గృహ నిర్మాణాలు ప్రారంభించకపోతే అవి రద్దు అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ జి. రామారావు, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, ఎఇ ఆర్.పవన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బి. మురళి పాల్గొన్నారు

ఆర్‌జెడి విస్తృత పర్యటన


విద్యాశాఖాధికారులతో మాట్లాడుతున్న ఆర్‌జెడి జ్యోతికుమారి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో శనివారం ఆర్‌జెడి ఎం.జ్యోతికుమారి విస్తృతంగా పర్యటించారు. ఆదర్శ పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థుల ప్రతిభను, అకడమిక్ కేలండర్ ప్రకారం సిలబస్‌ను పరిశీలించారు. నోట్ బుక్స్‌లో తప్పులను పరిశీలించారు. 9వ తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబుల వినియోగం, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని తెలిపారు. అనంతరం ఎంఆర్‌సి కార్యాలయాన్ని సందర్శించారు. సిఆర్‌పిలు, ఎంఆర్‌పి సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఇఒలు జి.జగదీష్, పి.బాలభాస్కరరావు, ప్రిన్సిపల్ ఆర్.ఈశ్వరరావు, ఎస్ఒ కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS (O/O DISTRICT REGISTRAR OF REGISTRATION OF CHITS AT : VIZIANAGARAM

ARBITRATION CLAIM PETTION No: 20/2023

Between:
Kapil Chits (Kosta) Private Limited, Represented by its Asst.Manager, Vizianagaram Branch, Vizianagaram district.
... Disputant

And

Kottapalli Varaprasada Rao & Others
... Opponents

Opponent -1:
Kottapalli Varaprasada Rao, S/o Simhachalam, Hindu, Aged 42 Years, Resident at, D.No 2- 260, Jaddetivalasa Village & Post, Jami Mandal, Viziangaram Dist.

Please take Notice that the above named disputant Filed the above Arbitration Claim Petition against you, and the matter coming for your appearance and stands posted to 28-12-2023, on the day your personally or through advocate attend before the honorable deputy registrar of chits at Vizianagaram at about 10.30 AM filing which the instructions court decided under the court of Law.

Sri. D. RAMA RAO,
Advocate,
Vizianagaram.

FACOR ALLOYS LIMITED
CIN L27101AP2004PLCO43252
Regd. Office & Works : Shreeramnagar-535101, Dist. Vizianagaram (A.P.)
PHONE : +91 8952282029, 282038, 282456 FAX : +91 8952 282188 Email: facoralloys@falgroup.in
Corp. Office: 160 B, Western Avenue, Sainik Farms, New Delhi – 110062, India
Phone: +91-11-4107 2935 ; Email: corpoffice@falgroup.in; Website: www.facoralloys.in

NOTICE

The Ministry of Corporate Affairs (MCA) has vide its circulars dated April 8, 2020, April 13, 2020, May 05, 2020, January 13, 2021, December 14, 2021, May 05, 2022 and September 25, 2023, permitted the holding of Annual General Meeting (AGM) through Video Conference and/or Other Audio-Visual Means (OAVM) by the Company. In compliance with these Circulars and the relevant provisions of the Companies Act, 2013 and SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015, the AGM of the Company will be held on 28.12.2023 at 12.00 P.M. through VC/OAVM.

As per the aforesaid circulars, the Notice of AGM along with Annual Report for FY-2022-2023 shall be sent only by electronic mode to those Members whose E-mail Id are already registered with the Company/ Depositaries. The Company is also providing e-voting and remote e-voting facility to all its Members for this meeting.

If your email ID is already registered with the Company/ Depositary, Notice of AGM along with Annual Report for FY-2022-2023 and login details for e-voting, if any, shall be sent to your registered email address. In case you have not registered your email ID with the Company/ Depositary, please follow below instructions to register your email ID immediately for obtaining Annual Report for FY-2022-2023 and login details for e-voting.

Physical Holding	Submit the duly filled & signed Form ISR-1 available on the Company's website at www.facoralloys.in as well as RTA's website at **www.masserv.com**, to our RTA i.e Mas Services Limited, T-34, 2nd Floor, Okhla Industrial Area, Phase-II, New Delhi - 110020 Phone No.+91-11-26387281-83 Fax No.+91-11-26387384 **E-Mail : investor@masserv.com**
Demat Holding	Please contact your Depositary Participant (DP) and register your email address as per the process advised by DP.

The Notice of AGM and Annual Report for FY-2022-2023 will also be available on Company's website at **www.facoralloys.in** and website of BSE Limited at **www.bseindia.com** upon completion of dispatch of Notice of AGM alongwith the Annual Report for F.Y. 2022-23 by the Company. Members attending the meeting through VC/ OAVM shall be counted for the purpose of Quorum under Section 103 of the Companies Act, 2013.

Place : Delhi
Date : 02.12.2023

for Facor Alloys Limited
Piyush Agarwal
Company Secretary & Compliance Officer
AAA